ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -173 పేజీలు - 8 వెల ₹03/- గురువారం 1 అక్టోబర్ 2026

అదనపు డిక్లరేషన్ అవసరం లేదు

'సర్'పై వివాదం వేళ.. ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం

కొత్త ఓటర్లకు తల్లిదండ్రుల వివరాలు అక్కర్లేదు

తాతలు, నానమ్మల వివరాలూ అవసరం లేదు

సర్ కొనసాగుతున్న చోట పాత నిబంధనే

ఫారం-6 ద్వారా కొనసాగనున్న నిరంతర నమోదు



ఢిల్లీ సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారికి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక మార్పు చేసింది. 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ' (సర్) పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో **మిగతా 2లో...**

రబీ పంటల మద్దతు ధర పెంపు

రబీ పంటల ఎంఎస్‌పీ పెంపునకు కేంద్రం ఆమోదం

కుసుమకు అత్యధికంగా రూ.675 పెంపు

ఆవాలకు రూ.413, గోధుమకు రూ.25 చొప్పున పెంపు

3,715 లక్షల టన్నులకు పెరిగిన గోధుమ సేకరణ

ఆరు రబీ పంటలకు రూ.8.36 లక్షల కోట్ల మద్దతు ధర

ఢిల్లీ సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి అన్ని రబీ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)**మిగతా 2లో...**





ఏపీలో సర్ గడువు పొడిగింపు..

అక్టోబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం

అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

అర్హులైన ఏ ఒక్క ఓటరు మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం

కొత్త తేదీలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశం

అమరావతి సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న **మిగతా 2లో...**

ఇది పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం



విజయవాడలో 26,401 పేద కుటుంబాలకు ఇంటి పట్టాల పంపిణీ

రూ.28,112 కోట్ల విలువైన భూములపై హక్కులు కల్పించిన ప్రభుత్వం

పేదల ఆత్మగౌరవానికి ఇది పట్టాభిషేకం అని పేర్కొన్న సీఎం చంద్రబాబు

అభివృద్ధికి గొడ్డలి పెట్టీ అడ్డుపడుతోందని తీవ్ర విమర్శలు

విజయవాడ సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతోందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో అభివృద్ధి జెట్ స్పీడ్‌తో పరుగులు పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, విజయవాడలో 26,401 పేద కుటుంబాలకు ఆయన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. సోమవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 'పేదలకు పట్టాభిషేకం' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.**మిగతా 2లో...**

బ్యాలెట్ పేపర్ విధానం అమలు చేయాలి

'ఇండియా' కూటమి 6 కీలక డిమాండ్లు



పాత ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్

ఓటర్ల జాబితా మార్పుల్లో పూర్తి పారదర్శకత ఉండాలని సూచన

ఓటరు తొలగింపుపై కారణాలు, అప్పీల్ అవకాశం కల్పించాలని డిమాండ్

ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ విధానం అమలు చేయాలన్న 'ఇండియా' కూటమి

ఈసీపై అన్ని రాజకీయ పక్షాలకు విశ్వాసం కలగాలని వ్యాఖ్య

ఢిల్లీ సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

ఎన్నికల సంఘం (ఈసీ) వ్యవహరిస్తున్న తీరుపై ఇండియా కూటమి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈసీ వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టేందుకు కూటమి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. భవిష్యత్ ఎన్నికల్లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కు ముందు ఉన్న ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకోవాలని ఇండియా కూటమి **మిగతా 2లో...**



కాంగ్రెస్‌ను వీడిన వారంతా
వెనక్కి రావాలి

జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి

సీఎంతో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ

నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య

గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం

హైదరాబాద్ సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి.**మిగతా 2లో...**

ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు.. సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

అక్టోబర్ 11 నుంచి 20 వరకు ఉత్సవాలు

క్యాంపు కార్యాలయంలో ఆహ్వానపత్రిక అందజేత

సీఎంకు అమ్మవారి ప్రసాదం, వేదాశీర్వచనం

ఉత్సవాల ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం

భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశం



అమరావతి సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 20 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆలయ అధికారులు, ధర్మకర్తల**మిగతా 2లో...**

యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం



క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మంత్రి లోకేశ్

అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన

పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ

కొచ్చి సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల **మిగతా 2లో...**

'గజ్వేల్ గడీ' తర్వాత ఇప్పుడు 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం..

కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు

సిరిసిల్లకు రూ.1,500 కోట్ల కేటాయింపు

కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి హామీ

బతుకమ్మ చీరలపై కమీషన్ల ఆరోపణలు

దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు




సిరిసిల్ల సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ **మిగతా 2లో...**

పేదలకు గరిష్ఠ ప్రయోజనం..

పాలనపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

అదనపు డిక్లరేషన్ అవసరం లేదు

మొదటిపేజీ తరువాయి

కొత్త ఓటర్లు ఇక తల్లిదండ్రులు, తాతలు, నానమ్మల ఓటరు జాబితా వివరాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఈ మేరకు ఫారం-6లో మార్పులు చేసింది.ఇప్పటివరకు కొత్త ఓటరు పేరు ఓటర్ల జాబితాలో చేర్చేందుకు సాధారణ ఫారం-6 సరిపోయేది. అయితే 'సర్' ప్రక్రియ సమయంలో ఫారం-6తో పాటు అదనపు డిక్లరేషన్ తీసుకున్నారు. గతంలో ఉన్న ఓటర్ల జాబితాతో తమ కుటుంబానికి ఉన్న సంబంధాన్ని నిర్ధారించేందుకు తల్లిదండ్రులు లేదా తాతల వివరాలు ఇవ్వాలని అందులో కోరారు.

'సర్' పూర్తయిన రాష్ట్రాల్లో ఇప్పుడు ఈ అదనపు డిక్లరేషన్ అవసరం ఉండదు. బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ పూర్తయిందని ఈసీ తెలిపింది. సర్ సమయంలో పేరు జాబితాలో లేని వారు, అలాగే కొత్తగా ఓటు హక్కు పొందిన యువత, తొలిసారి ఓటు వేయబోయే వారు నిరంతర అప్‌డేషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసుకోవచ్చు.అయితే 'సర్' ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం ఈ నిబంధన కొనసాగుతుంది. అక్కడ కొత్త ఓటర్లు ఫారం-6తో పాటు 'సర్'కు సంబంధించిన డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది. గత ఓటర్ల జాబితాతో తమ సంబంధాన్ని చూపించే వివరాలను కూడా ఇవ్వాలి. ఫారం-6లో మార్పులపై ఈసీలో విభేదాలు ఉన్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అదనపు డిక్లరేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఫారం-6, 'సర్'కు సంబంధించిన నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ స్పష్టం చేసింది.సెప్టెంబర్ 26న విడుదల చేసిన వివరణలో సర్ డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ఈసీ పేర్కొంది. సర్ పూర్తయిన ప్రాంతాల్లో, అలాగే ఇంకా ప్రారంభం కాని ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్ అవసరం లేదని తెలిపింది.తాజా మార్పుతో సర్ పూర్తయిన రాష్ట్రాల్లో కొత్త ఓటర్లు ఇక సాధారణ ఫారం-6 ద్వారానే నమోదు చేసుకోవచ్చు. అదనంగా కుటుంబానికి సంబంధించిన పాత ఓటర్ల జాబితా వివరాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

బ్యాలెట్ పేపర్ విధానం అమలు చేయాలి

మొదటిపేజీ తరువాయి

కోరింది. ఓటర్ల జాబితాలో జరిగే ప్రతి మార్పుపై పూర్తి పారదర్శకత ఉండాలని చెప్పింది. నియోజకవర్గం, పోలింగ్ బూత్ వారీగా చేర్పులు, తొలగింపులు, సవరణల వివరాలను బహిరంగంగా ఉంచాలని డిమాండ్ చేసింది.ఓటరును జాబితా నుంచి తొలగించే ముందు కారణాలను తెలియజేయాలని కూటమి కోరింది. అలాంటి నిర్ణయంపై అప్పీల్ చేసుకునేందుకు సమర్థమైన విధానం ఉండాలని పేర్కొంది. పరిపాలనా లోపాలు, తగిన పత్రాలు లేకపోవడం, అవగాహన లేకపోవడం వంటి కారణాలతో అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని కోరింది. ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని ఇండియా కూటమి డిమాండ్ చేసింది. యువత, తొలిసారి ఓటు వేయబోయే వారికి సులభంగా ఓటరు నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరింది.ఎన్నికల వ్యవస్థలో సంస్థాగత జవాబుదారీతనం పెరగాలని ఖర్గే అన్నారు. అన్ని రాజకీయ పక్షాలకు విశ్వాసం కలిగించేలా ఎన్నికల సంఘం పనిచేయాలని డిమాండ్ చేశారు.హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందని రాహుల్ గాంధీ ఆధారాలతో చూపించారని ఖర్గే ఆరోపించారు. ఈ అంశంపై ఈసీ స్పందించలేదని అన్నారు. పారదర్శకత స్థానంలో రహస్య విధానం రాకూడదని, ఒక్క వ్యక్తికి ఒక ఓటు, ఓటుకు సమాన విలువ అనే సూత్రం బలహీనపడకూడదని ఇండియా కూటమి పేర్కొంది.

ఇది పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "విశాఖపట్నంలో 28 వేల మందికి, మంగళగిరిలో 5,800 కుటుంబాలకు ఇప్పటికే పట్టాలు అందజేశాం. ఇప్పుడు విజయవాడలో 26,401 కుటుంబాలకు రూ.28,112 కోట్ల విలువైన 707 ఎకరాల భూములపై పూర్తి హక్కులు కల్పిస్తున్నాం. ఇది పేదల ఆత్మగౌరవానికి మా ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం" అని పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 60 వేల కుటుంబాలకు రూ.52 వేల కోట్ల విలువైన భూములను అందించడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

గొడ్డలి పార్టీ అంటూ తీవ్ర విమర్శలు

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019-24 మధ్య పాలకులు ప్రతి ఇంట్లో ఆస్తుల వివాదాలు సృష్టించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ప్రజలను భయాందోళనకు గురిచేశారు. సర్వే రాళ్లపై తమ బొమ్మలు ముద్రించుకోవడం కోసం రూ.800 కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేశారు. ఇప్పుడు మేము రాజముద్రతో కూడిన వివాదరహిత పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నాం" అని వెల్లడించారు. పురాణాల్లో యజ్ఞాలకు రాక్షసులు అడ్డుపడినట్లు, తాము చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనికి గొడ్డలి పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. అమరావతి నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాయడం, చెరకు తోటలను తగలబెట్టడం వంటి చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి తమ ప్రభుత్వానికి రెండు కళ్లని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "పట్టిసీమను అడ్డుకోవాలని చూసినా, పట్టుదలతో పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీరందించాం. వచ్చే ఏడాది నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేస్తాం. అలాగే రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను మూడేళ్ల కాలంలో పూర్తి చేస్తాం" అని హామీ ఇచ్చారు. మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని, కేంద్ర గణాంకాల ప్రకారం విమెన్ వర్క్ ఫోర్సులో విశాఖపట్నం, విజయవాడ నగరాలు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పేదలందరికీ సొంత ఇల్లు, ఇంటి స్థలం, కుళాయి కనెక్షన్ అందించడమే కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు.

జెన్-జీ మార్పు కోరుకుంటోంది

కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా యువతలో కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకుంటున్న యువత ఒక వర్గంగా ముందుకు వస్తోందని చెప్పారు. యువతతో కలిసి సమస్యలకు పరిష్కారాలు వెతకడం తనకు ఉత్సాహాన్నిస్తోందన్నారు.

డీఎస్సీపై ఆరోపణలు.. సర్టిఫికెట్లపై క్లారిటీ

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించామని లోకేశ్ తెలిపారు. క్రీడా కోటాలో ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలే జారీ చేశారని చెప్పారు. ఈ అంశంపై కోర్టు, సీబీఐ దర్యాప్తు కోరినా.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్

క్వాంటమ్ టెక్నాలజీ ఊహ కాదని.. ఇది నెక్ట్స్ జనరేషన్ టెక్నాలజీ అని లోకేశ్ అన్నారు. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పని చేస్తూ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

విద్యా వ్యవస్థ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మారాలని లోకేశ్ అన్నారు. గత రెండేళ్లలో 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఏఐ నుంచి క్వాంటమ్ వరకు భవిష్యత్ టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలకు కనీసం దశాబ్ద కాలం పడుతుందని పేర్కొన్నారు.

పెట్టుబడులకు '3ఎస్' మంత్రం

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 3ఎస్ విధానాన్ని అనుసరిస్తున్నామని లోకేశ్ చెప్పారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులకు తెలియజేయడం, ప్రభుత్వాలు మారినా విధానాల్లో స్థిరత్వం ఉండేలా చూడటం తమ విధానమన్నారు. వ్యవసాయం నుంచి క్వాంటమ్ వరకు 23 క్లస్టర్లలో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

పేదలకు గరిష్ఠ ప్రయోజనం..

పాలనపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

అమరావతి సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను సమన్వయం చేయడం ద్వారా పేదలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పాలనలో నాణ్యత, పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులకు కూడా ఐఐఎం, ఐఐటీల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో శిక్షణ ఇప్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

బుధవారం 'పేదల సేవలో – సంక్షేమ కార్యక్రమాల కన్వర్జెన్స్' అనే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన జూమ్ వేదికగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి పేద కుటుంబానికి సగటున 4 నుంచి 5 పథకాలు అందుతున్నాయని, స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం వంటి పథకాలన్నింటినీ సమన్వయం చేసి లబ్ధిదారులకు మరింత అండగా నిలవాలని సూచించారు.

పేదరికం, ఆర్థిక అసమానతలు లేని నియోజకవర్గాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు. పీ4 (ప్రజలు-ప్రభుత్వం-ప్రైవేటు భాగస్వామ్యం) మోడల్ అమలు తీరును నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షల బంగారు కుటుంబాలకు మార్గదర్శకులు పీ4 కార్యక్రమం కింద చేయూతనిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

పాలనలో సాంకేతికతను జోడించడం ద్వారా పౌర సేవలను మరింత సులభతరం చేయవచ్చని సీఎం పేర్కొన్నారు. సేవలను సమర్థంగా అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల దృక్పథం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) పెరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో పాటు ప్రతి ఉద్యోగికి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్లు, నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, తమ ప్రభుత్వం పొలిటికల్ గవర్నెన్స్‌కే అత్యంత ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. డ్వాక్రా మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం 'స్వయం బ్రాండ్'ను ప్రోత్సహిస్తున్నామని, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వివరించారు. పల్లె పండుగ-3.0 ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆస్తులు కల్పించబడతాయని, అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత తప్పనిసరి అని ఆదేశించారు. ఏటా అక్టోబర్ 2వ తేదీన రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో 'స్వచ్ఛాంధ్ర అవార్డులు' ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. ద్రవ్యోల్బణ భారం ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతు బజార్లలో తక్కువ ధరకు ఉల్లిని అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శంగా నిలపడమే తమ అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలి

మొదటిపేజీ తరువాయి

జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు.ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

రబీ పంటల మద్దతు ధర పెంపు

మొదటిపేజీ తరువాయి

పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

రబీ పంటల్లో కుసుమ మద్దతు ధరను అత్యధికంగా క్వింటాల్‌పై రూ.675 పెంచారు. ఆ తర్వాత ఆవాలకు రూ.413 పెంపు ప్రకటించారు. మసూర్ పప్పుకు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున ఎంఎస్‌పీ పెంచారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ఈ పెంపు చేసినట్లు కేంద్రం తెలిపింది. ఉత్పత్తి వ్యయంపై కనీసం 1.5 రెట్ల స్థాయిలో ఎంఎస్‌పీ ఉండేలా చూడాలన్న 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఇటీవలి కాలంలో తృణధాన్యాలతో పాటు పప్పులు, నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం ఎక్కువ మద్దతు ధర అందిస్తోంది. 2014-15 నుంచి 2025-26 మధ్య గోధుమల సేకరణ 3,715 లక్షల టన్నులకు పెరిగింది. 2004-05 నుంచి 2013-14 మధ్య ఇది 2,254 లక్షల టన్నులుగా ఉంది. ఆరు రబీ పంటల సేకరణ కూడా ఇదే కాలంలో 3,921 లక్షల టన్నులకు చేరింది. గతంలో ఇది 2,302 లక్షల టన్నులుగా ఉండేది.గోధుమ రైతులకు 2014-15 నుంచి 2025-26 మధ్య మద్దతు ధర రూపంలో రూ.7.31 లక్షల కోట్లు చెల్లించారు. 2004-05 నుంచి 2013-14 మధ్య చెల్లించిన రూ.2.56 లక్షల కోట్లతో పోలిస్తే ఇది ఎక్కువ. ఆరు రబీ పంటలు పండించే రైతులకు ఇదే కాలంలో రూ.8.36 లక్షల కోట్లు ఎంఎస్‌పీగా చెల్లించగా.. అంతకుముందు కాలంలో రూ.2.65 లక్షల కోట్లు చెల్లించారు.

ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు.. సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి

మండలి సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని అందించి, వేదాశీర్వచనం పలికారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చంద్రబాబు ఆరా తీశారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దుర్గగుడి ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఏపీలో సర్ గడువు పొడిగింపు..

మొదటిపేజీ తరువాయి

పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం.

కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న విచారణలు (హియరింగ్‌లు), ముఖ్యంగా నో-మ్యాపింగ్, లాజికల్ డిస్క్రిపెన్సీ కేసులు, ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ పొడిగింపు ఇచ్చినట్లు పేర్కొంది.కాగా, 2026 జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. మారిన తేదీల వివరాలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈసీ అధికారులను సూచించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మేఘాలయ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితా సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

'గజ్వేల్ గడీ' తర్వాత ఇప్పుడు

'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం..



మొదటిపేజీ తరువాయి

కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు.కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. 'పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ' అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు.గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు.

బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లే

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఎం విమర్శించారు. టీవీలు, పేపర్లు, స్టార్ హోటళ్లు, ఫామ్‌హౌస్‌లు మాత్రమే సంపాదించుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకుని కమీషన్లు తీసుకున్నారని, చివరకు బతుకమ్మ చీరల తయారీలోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'పుట్టింటి సారె' పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని చెప్పారు.

దళితులపై చిన్నచూపా?

అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించి అవమానించిన ఘనత బీఆర్ఎస్ నాయకులదేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగి అణగదొక్కారని ఆరోపించారు. దళితులంటే బీఆర్ఎస్‌కు అంత చిన్నచూపా అని ప్రశ్నించారు.

ఎర్రవల్లి భూముల ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుల అక్రమాస్తులపై లెక్కలు తేలుస్తున్నామని సీఎం అన్నారు. 'ఎట్ హోమ్', 'దక్కన్ స్టార్ హోటల్స్' పేరుతో ఉన్న ఆస్తులు వారి పేర్లకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమయం లేక కొన్ని విషయాలు చెప్పలేకపోయామని, త్వరలో 'పార్ట్-2'లో అన్ని వివరాలు బయటపెడతామని ప్రకటించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

డోన్ రైల్వే స్టేషన్ లో స్వచ్ఛతా హీ సేవా 2026





డోన్ (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 30)

డోన్ రైల్వే ఆరోగ్య కేంద్రం లో రైల్వే పారిశుధ్య కార్మికులకి ఉచిత ఆరోగ్య తనిఖీలు చేసే శిభిరాలని ఏర్పాటు చేశారు.రైల్వే డాక్టర్ జ్యోష్ణ ప్రియదర్శిని రైల్వే పారిశుధ్య కార్మికులకి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తగు ఆరోగ్య సూచనలు ఆరోగ్యానికి సంబంధిన ప్రసంగాన్ని వారికి అందించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధగా ఉండాలని , ఆరోగ్యాన్ని నిర్లక్షం చేయరాదని , ఆరోగ్యమే మహా భాగ్యం అని వారికి సూచించారురైల్వే సఫాయి కర్మచారులకి పనికి సంబంధించిన PPE's అందించారు



అత్యున్నత ప్రదర్శన చేసిన సఫాయి కర్మచారులను బహుమానాలతో సత్కరించారు. ఈ కార్యక్రంలో డోన్ స్టేషన్ మేనేజర్ ప్రమోద్ మరియు డోన్ రైల్వే స్టేషన్ చీఫ్ హెల్త్ ఇన్స్పెక్టర్ జి. విజయ్ కుమార్ పాల్గొన్నారు. చీఫ్ హెల్త్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ మాట్లుడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు సెప్టెంబర్ 17 వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతాయని, మహాత్మా గాంధీ జయంతి అక్టోబర్ 2 వ తేదీనా ఈ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు రైల్వే సఫాయి కర్మచారులకు మరియు రైల్వే ఉద్యోగులకి ధన్యవాదాలు తెలిపారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను భర్తరఫ్ చేసి అరెస్టు చేయాలి

ఓటర్ల జాబితాపై సమగ్ర విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 30)

ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే భర్తరఫ్ చేసి, ఆయనపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సూచనల మేరకు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాలతో కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ, కర్నూలు సిటీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేపట్టారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని భాష నేతృత్వంలో నిర్వహించిన ధర్నాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిలాని భాష మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను భర్తరఫ్ చేసి, ఆయనపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్న 'ఓటు చోరీ' అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని, నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని జిలాని భాష డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో



పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడ్డాయంటూ వస్తున్న నివేదికలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రతి ఓటరు పేరు తొలగింపునకు కారణాన్ని పారదర్శకంగా వెల్లడించాలని అన్నారు.మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు ఎం. సుధాకర్ బాబు మాట్లాడుతూ అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించకూడదన్నారు. అనర్హంగా తొలగించబడిన అర్హులైన ఓటర్ల పేర్లను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు.

ఓటర్ల జాబితాలపై వచ్చిన ఆరోపణలు, డిజిటల్ వ్యవస్థలో మార్పులు, ఓటర్ల పేర్ల తొలగింపు వంటి అంశాలపై స్వతంత్రంగా, పారదర్శకంగా, సమగ్రంగా విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం ఎన్నికల సంఘం బాధ్యత అని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా ఎన్నికల సంఘం పారదర్శక చర్యలు చేపట్టాలని సుధాకర్ బాబు కోరారు. ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు ఎం. సుధాకర్ బాబు, మాజీ డీసీసీ అధ్యక్షుడు కే. బాబురావు, కర్నూలు నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ అలీఖాన్ కోఆర్డినేటర్లు ఎం. కాశీం వలి, అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.సి. బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డి.వి. సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ వై. మారుతిరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనిధి రాయల్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. సుంకన్న, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, ఐఎన్‌టీయూసీ సిటీ అధ్యక్షుడు రేపల్లె ప్రతాప్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటును సకాలంలో గుర్తించి స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు

కర్నూలు మెడికల్ కాలేజీలో పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ పీజీ విద్యార్థులకు సమగ్ర హృదయ అత్యవసర జీవన సహాయ శిక్షణ

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 30)

గుండెపోటు లేదా గుండె ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితులను సకాలంలో గుర్తించి, వెంటనే తగిన వైద్య సహాయం అందిస్తే విలువైన ప్రాణాలను కాపాడవచ్చని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, అదనపు వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ కె. చిట్టి నరసమ్మ అన్నారు.

కర్నూలు మెడికల్ కాలేజీలోని అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో స్కిల్ ల్యాబ్‌లో పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ పీజీ విద్యార్థులకు రెండు రోజుల సమగ్ర హృదయ అత్యవసర జీవన సహాయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ గుండె ఆగిపోయిన తొలి కొన్ని నిమిషాలు అత్యంత కీలకమని తెలిపారు.

అత్యవసర సమయంలో సరైన పద్ధతిలో గుండె-ఊపిరితిత్తుల పునరుజ్జీవన చర్యలు చేపట్టడం, విద్యుత్ షాక్ ద్వారా గుండెను సాధారణ స్థితికి తీసుకురావడం, ఇతర అత్యవసర వైద్య చర్యలను వేగంగా చేపట్టడం ద్వారా ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి వైద్యుడు ఆధునిక హృదయ అత్యవసర జీవన సహాయ విధానాలపై పూర్తి



అవగాహనతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలను కలిగి ఉండాలని సూచించారు.

శిక్షణలో భాగంగా అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన ఆధునిక వైద్య పద్ధతులు, పరికరాల వినియోగం, సకాలంలో స్పందించాల్సిన విధానాలు తదితర అంశాలను మానికిన్ ద్వారా ప్రత్యక్షంగా ప్రదర్శించి విద్యార్థులకు ఆచరణాత్మకంగా శిక్షణ ఇచ్చారు. జిల్లా స్థాయిలో వైద్యులు, పీజీ, యూజీ విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు, నర్సింగ్ సిబ్బందికి దశలవారీగా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను



నిర్వహిస్తున్నట్లు డాక్టర్ చిట్టి నరసమ్మ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది వేగంగా, సమర్థవంతంగా స్పందించేలా ఈ శిక్షణలు దోహదపడతాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో అనస్థీషియా విభాగాధిపతి సుధీర్, ప్రొఫెసర్లు విశాల, ఎల్. రామ్ శివనాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జయదేవ్, రాథోడ్, భారతి, సుమియా బేగం, రఘు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

పోలీసు అధికారులకు తుది పోలింగ్ కేంద్రాల జాబితా అందజేత

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 30)

త్వరలో జరగనున్న నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పటిష్ట చర్యలు చేపట్టాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పోలీసు అధికారులను ఆదేశించారు.

నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో డీఎస్పీ కె.వి. రాఘవేంద్రతో పాటు నగర పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదల చేసిన తుది పోలింగ్ కేంద్రాల జాబితాను పోలీసు అధికారులకు అందజేశారు.

పోలింగ్ కేంద్రాలను సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలుగా మూడు కేటగిరీలుగా విభజించి, ఆయా కేంద్రాలకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని కమిషనర్ సూచించారు. ఈ వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించనున్నట్లు తెలిపారు.



నగరంలో మొత్తం 487 పోలింగ్ కేంద్రాల పరిధిలో 4,79,861 మంది ఓటర్లు ఉన్నారని కమిషనర్ వెల్లడించారు. ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల వారీగా భద్రతా ఏర్పాట్లను ముందుగానే పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అన్ని పోలింగ్



కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ర్యాంపులు, విద్యుత్ దీపాలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖ తరపున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

సమావేశంలో సీఐలు చంద్రబాబు నాయుడు, పి. శేషయ్య, బి.వి. విక్రమసింహా, జి. మారుతి శంకర్, ఎస్ఐలు మోహన్ కిషన్ రెడ్డి, ఎస్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్



నేడు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆళ్లగడ్డ కు చెందిన చిత్రకారుడు జానా విజయ్ ఒక మంచి చిత్రాన్ని చిత్రించాడు ఈ చిత్రంలో ఒక వృద్ధుడు చిన్న పిల్లలకు మార్గ నిర్దేశం చేస్తున్నట్లుగా ఉన్న ఈ చిత్రం జీవితం పై ఎన్నో ఆశలు పెట్టుకొని ఎదుగుతున్న పిల్లలను, యువకులను ఆలోచింప చేస్తోంది. తమ జీవిత చరమాంఖంలో ఉన్న పెద్దలు చెప్పే మాటలను పెడచెవిన పెట్టరాదని వారి మాటలలోని జీవిత సత్యాలను నేటి యువ తరం గుర్తించాలి. పెద్దల మాటలు ఇప్పుడు వినకపోతే తమ జీవిత ప్రయాణం లో ఎదురైయే ఒడిదుకులను తట్టుకోలేక సమస్యల సుడి గుండంలో చిక్కుకోక తప్పదని కావుననేటి పిల్లలు, యువకులు పెద్దల మాటలను పెద్దలను గౌరవించాలని చిత్రకారుడు విజయ్ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

పల్లె పండుగలో సీసీ రోడ్లకు భూమిపూజ

రూ.15 లక్షలతో పనులకు శ్రీకారం

గుత్తి, సెప్టెంబరు 30:(రిపబ్లిక్ న్యూస్)



గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో పల్లె పండుగ3.0 కార్యక్రమంలో భాగంగా రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ, శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, గుమ్మనూరు ఈశ్వర్, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా బేతపల్లి టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకట శివుడు యాదవ్, గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బేతపల్లిలో రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు కొనసాగాలంటే కూటమి ప్రభుత్వానికి ప్రజల సహకారం అవసరమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్ నాయక్, డిఈఈ జ్యోతి, డిప్యూటీ తాసిల్దార్ సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బద్రివలీ,పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రతాప్,మండల అధ్యక్షుడు లక్ష్మీ రంగయ్య ,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు, రమేష్,రాజా, బేతపల్లి టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.?

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట బందోబస్తు ప్రణాళిక

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 30)



రాబోయే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు.వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వెల్దుర్తి మండలంలోని సమస్యాత్మక గ్రామాలు, అక్కడి పరిస్థితులు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై ఎస్సై నరేష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలింగ్ కేంద్రాలు, పోలీస్ పికెట్లను నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ సూచించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి వాటికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.పంచాయతీ ఎన్నికల బందోబస్తుకు ముందుగానే పటిష్టమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశాలను ముందుగానే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో వెల్దుర్తి ఎస్సై నరేష్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ జన్మదిన వేడుకల్లో విద్యార్థుల ప్రతిభకు పట్టం

చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు ప్రత్యేక బహుమతులు ప్రధానం చేసిన బీజేపీ నాయకులు

పాములపాడు సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్:- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పాములపాడు మండలంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రత్యేక బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.



బీజేపీ మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మండలంలోని, పాములపాడు, లింగాల, మిట్టకందాల, వేంపెంట ప్రభుత్వ పాఠశాలలు, శ్రీ వివేకానంద విద్యా విహార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు సూచనలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాల సేవా ప్రస్థానం, 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు.మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర్ భారత్, దేశ అభివృద్ధి ప్రయాణం వంటి అంశాలపై విద్యార్థులు చిత్రాలు గీయడంతో పాటు వ్యాసరచన, వక్తృత్వం ద్వారా తమ మేదో శక్తి ద్వారా వ్యక్తం చేశారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ప్రత్యేక బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణయ్య, పార్టీ కార్యకర్తలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

రూ.20.87 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి రఘునాథ్‌రెడ్డి



శ్రీసత్యసాయి/బుక్కపట్నం, సెప్టెంబరు 30.(రిపబ్లిక్ న్యూస్)
పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా బుక్కపట్నం మండలంలో రూ.20.87 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 53 అభివృద్ధి పనులకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి బుధవారం ప్రారంభోత్సవాలు చేశారు. పలు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడారు.గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతులు తదితర అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. సుమారు రూ.69 వేల కోట్ల విలువైన వివిధ అభివృద్ధి, పెట్టుబడి ప్రాజెక్టులు నియోజకవర్గానికి రానున్నాయని చెప్పారు. ఇందులో సుమారు రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు, ఆమడగూరులో రిలయన్స్ సహకారంతో రూ.51 వేల కోట్లతో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు ఉన్నాయని వివరించారు.ఈ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చితే ప్రాంతంలో ఉపాధి అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని పల్లె సింధూరరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.

ఎన్నికల సంఘం స్వతంత్రంగా, రాజ్యాంగబద్ధంగా పనిచేయాలి

ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, ఓటు హక్కుకు రక్షణ కల్పించాలి

జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సీజేపీ డిమాండ్.. అక్టోబర్ 2న ముంబైలో 'జైలు భరో'



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 30)
ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పనిచేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. కర్నూలు నగరంలోని బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాల్లో సీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సౌత్ ఇండియా కోఆర్డినేటర్ చేతన్ ప్రమోద్ మాట్లాడారు.
భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తమ పార్టీకి పలు అభ్యంతరాలు ఉన్నాయని చేతన్ ప్రమోద్ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సాగాలని కోరారు.ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలు ప్రజల ఓటు హక్కుపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, ఓటర్ల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాల్లో తగిన పారదర్శకత, న్యాయపరమైన భద్రత ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికల సంఘంలోని సభ్యుల మధ్య నిర్ణయాల విషయంలో భిన్నాభిప్రాయాలు ఏర్పడిన సందర్భాల్లో వాటిని ప్రజలకు స్పష్టంగా తెలియజేయడంతో పాటు సంస్థాగత విధానాలను పాటించాలని కోరారు. గత పది నెలల్లో ఎన్నికల సంఘం సభ్యులు వివేక్ జోషి, సుఖ్వీందర్ సింగ్ పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారని సీజేపీ పేర్కొంది. ఈ అంశాలకు సంబంధించిన అధికారిక రికార్డులు, నిర్ణయ ప్రక్రియను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేసింది.

ఫారం6పై ఆంక్షలు తొలగించాలి
ఫారం6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో అనవసరమైన ఆంక్షలు విధించకుండా, అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటరుగా నమోదు అయ్యే అవకాశం కల్పించాలని సీజేపీ డిమాండ్ చేసింది. అర్హులైన పౌరులందరి పేర్లు ఓటర్ల జాబితాలో ఉండేలా ఎన్నికల వ్యవస్థ పనిచేయాలని చేతన్ ప్రమోద్ అన్నారు.
ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధమైన అధికారాలు, బాధ్యతల పరిధిలో ముఖ్యంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 స్ఫూర్తికి అనుగుణంగా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సంఘం సభ్యుల నియామక విధానంలో మరింత పారదర్శకత, స్వతంత్రత కోసం అవసరమైన రాజ్యాంగబద్ధమైన సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్న తీరుపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని సీజేపీ తెలిపింది. ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఎన్నికల సంఘం వ్యక్తిగత నిర్ణయాల ఆధారంగా కాకుండా సంస్థాగత, సమిష్టి నిర్ణయ ప్రక్రియ ద్వారా పనిచేయాలని కోరింది.

అక్టోబర్ 2న ముంబైలో 'జైలు భరో'
గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీపికే ఇచ్చిన పిలుపు మేరకు ముంబైలోని శివాజీ పార్క్ వద్ద 'జైలు భరో' కార్యక్రమం నిర్వహించనున్నట్లు చేతన్ ప్రమోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి సీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.
ప్రజాస్వామ్యం, ఓటు హక్కు, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని చేతన్ ప్రమోద్ తెలిపారు.
సమావేశంలో సీజేపీ ఆంధ్రప్రదేశ్ సభ్యులు బి. నారాయణ, కే. ఇస్మాయిల్, వెంకటస్వామితో పాటు కర్నూలు సభ్యులు అడ్వకేట్ రవి, డేవిడ్, యు. జమ్మన్న పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి

టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పిలుపు



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 30)
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సమష్టిగా పనిచేయాలని టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పిలుపునిచ్చారు.కర్నూలులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆమె అధ్యక్షతన పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతినెలా జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆది కృష్ణమ్మ తెలిపారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీకి మద్దతు కూడగట్టాలని ఆమె కోరారు. మున్సిపల్ చైర్మన్, మేయర్, నగర పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ తదితర స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సమావేశంలో నాయకులు సూచించారు. ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాలను ప్రజలకు వాస్తవాలతో వివరించాలని, పార్టీ నాయకుల మధ్య ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను తిప్పికొట్టి అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆది కృష్ణమ్మ కోరారు.సమావేశంలో ఎమ్మెల్యేలు డాక్టర్ బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి, మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మిన్నప్ప, విక్రమ్‌సింగ్, కే. తుగ్గలి నాగేంద్ర, కైప పద్మలతరెడ్డి, డి. జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.


న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలి

రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ డిమాండ్



అనంతపురంసెప్టెంబర్ 30.(రిపబ్లిక్ న్యూస్)
న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు, వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక న్యాయవాదుల రక్షణ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే తీసుకురావాలని బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ డిమాండ్ చేశారు. బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ మాట్లాడుతూప్రజలకు న్యాయం అందించడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. బాధితులు, నిందితులు, వివిధ వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణ కోసం న్యాయస్థానాల్లో వాదించడం న్యాయవాదుల వృత్తిపరమైన బాధ్యతగా పేర్కొన్నారు. అయితే విధి నిర్వహణలో భాగంగా పలువురు న్యాయవాదులు బెదిరింపులు, దాడులు, వేధింపులు, వృత్తిపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ వాదులకు సమగ్ర చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ కల్పించడం అంటే కేవలం ఒక వృత్తికి భద్రత కల్పించడం కాదని, న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించే ప్రతి పౌరుడి హక్కులను బలోపేతం చేయడమేనని పేర్కొన్నారు.న్యాయవాదుల సంఘాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంప్రదింపులు జరిపి సమగ్ర రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. ఇటీవల విజయవాడలో న్యాయవాదిపై జరిగిన దాడిని బీసీ న్యాయవాదుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి, మల్లేష్, నాగభూషణ, మంజునాథ్, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠం జ్యోతి కి కృతజ్ఞతలు తెలిపిన చిప్పగిరి విద్యా కమిటీ చైర్మన్ లు వైస్ చైర్మన్లు





చిప్పగిరి, సెప్టెంబర్, 30,(రిపబ్లిక్ న్యూస్) చిప్పగిరి గ్రామ జడ్పీ హైస్కూల్ పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ కత్రిమల రామాంజనేయులు, వైస్ చైర్మన్ కాకర్ల సురేంద్ర, ఎంపీపీ స్కూల్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దొడ్డి లక్ష్మి, వైస్ చైర్మన్ తలారి చిన్న పెద్దయ్య, కేజీబీవీ విద్యా కమిటీ చైర్మన్ శివగంగా, ఎంపీపీ స్కూల్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మల్లికార్జున, వైస్ చైర్మన్ సురేష్, ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్ నివాసం నందు బుధవారం కు కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, సింగిల్ విండో చైర్మన్ కొండ రామాంజనేయులు, క్లస్టర్ ప్రభాకర్, దేవరగట్టు ఆలయ కమిటీ డైరెక్టర్ దేవక్క గారి జయన్న, పోతురాజు రాముడు, జనార్దన్ స్వామి, కొట్టం గోవిందరాజులు, జి ఎస్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా...రాయలసీమ

హిందూపురంలో ఘనంగా ట్రాక్టర్ ర్యాలీ

పాల్గొన్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



హిందూపురం సంక్షేమం,సెప్టెంబరు 30.(రిపబ్లిక్ న్యూస్)
రాయలసీమను ఉద్యాన పంటల ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువ జోడింపు, కోల్డ్‌చైన్, అంతర్జాతీయ ఎగుమతులకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌రాయలసీమ రైజింగ్' కార్యక్రమంపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు హిందూపురంలో బుధవారం భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఎంజీఎం గ్రౌండ్ నుంచి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ర్యాలీని ప్రారంభించారు.ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ర్యాలీ సందడిగా సాగింది. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ట్రాక్టర్లతో నిర్వహించిన ర్యాలీ ద్వారా ఉద్యాన పంటల ఆధునిక సాగు, మార్కెటింగ్, విలువ జోడింపుపై రైతులకు సందేశాన్ని అందించారు.

నాణ్యమైన ఉత్పత్తిని సాధించే అవకాశం ఉంది
రాయలసీమలోని వాతావరణ పరిస్థితులు, ఉద్యాన పంటలకు ఉన్న అనుకూలతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. బిందు, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య విధానాలతోపాటు పాలీహౌస్, షేడ్‌నెట్ వంటి రక్షిత సాగు పద్ధతులను విస్తృతం చేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే తక్కువ వనరులతో నాణ్యమైన ఉత్పత్తిని సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.పంట ఉత్పత్తి తర్వాత నష్టాలను తగ్గించేందుకు కోల్డ్‌చైన్ వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం, ఉత్పత్తులకు విలువ జోడించి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయడం ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఉద్యాన రంగ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమ ఉద్యాన రంగ సామర్థ్యాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లడమే "గ్లోబల్ హార్టికల్చర్ హబ్" ప్రధాన ఉద్దేశమన్నారు. విత్తనం నాటిన దశ నుంచి పంట మార్కెటింగ్, ప్రాసెసింగ్, విలువ జోడింపు వరకు ప్రతి దశలో ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. రైతులు సంప్రదాయ పద్ధతులకు మాత్రమే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉద్యాన రంగ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జయకుమార్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, మండల ఉద్యాన అధికారి మహేష్ నాయక్, మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్, ఆర్ఎస్‌కే సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



గుత్తి, సెప్టెంబర్ 30:(రిపబ్లిక్ న్యూస్) గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బేతపల్లి గ్రామంలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సీడీపీఓ ఎల్లమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.సీడీపీఓ ఎల్లమ్మ మాట్లాడుతూ 06 ఏళ్ల చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలకు పోషక విలువలున్న ఆహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. తల్లి, శిశువు ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు కూడా శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల పోషణ, మహిళల ఆరోగ్య పరిరక్షణలో సమాజ భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. అర్హులైన మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో సీఎం పర్యటన పేరుతో ప్రజా గొంతుకను అణచివేయడం సరికాదు...

-జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



రాయికల్ మండలం సెప్టెంబర్ 30 (రిపబ్లిక్ న్యూస్)
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా సంచరించే హక్కు, ప్రజలను కలుసుకునే హక్కు, వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేసే హక్కు ఉంటుందని అన్నారు. అయితే సీఎం పర్యటన పేరుతో తనను ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు.ప్రభుత్వ కార్యక్రమాలు, ముఖ్యమంత్రి పర్యటనలకు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యతే అయినప్పటికీ, ఆ పేరుతో రాజకీయ నాయకులను, ప్రజా ప్రతినిధులను ముందస్తుగా నిర్బంధించడం, వారి సాధారణ కార్యక్రమాలను అడ్డుకోవడం సరైన విధానం కాదన్నారు.సిరిసిల్ల పర్యటనకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులకు ఒక నీతి మాకో నీతా అని ప్రశ్నించారు.పోలీసులు ప్రజలకు రక్షణ ఇస్తూ ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి తప్ప కాంగ్రెస్ పార్టీ నాయకుల్ల వ్యవహరించకూడదు అని అన్నారు
రేవంత్ రెడ్డి సిరిసిల్లకు ఏ ముఖం పెట్టుకొని వస్తున్నాడని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నేతన్నల బతుకులు ఉరె సరి అనే విధంగా ఉండేదని తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో కేటీఆర్ నేతన్నల జీవితాల్లో వెలుగు నింపారని అన్నారు.
మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నేతన్నల కు ఇచ్చిన హామీలు నెరవేర్చక కెసిర్ హయాంలో ఉన్న హామీలను కూడా అమలు చేయడం లేదని అన్నారు.
తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ గారిని వారి కుటుంబాన్ని తిట్టడం తప్ప రేవంత్ రెడ్డికి పాలన చేయడం చేతకాదని అన్నారు.
కేసీఆర్ ని ప్రజల గుండెల్లో నుంచి చెరిపేయడం ఎవరి తరం కాదని మీకు చాతనైతే కేసీఆర్ గారి పాలన ఆదర్శంగా తీసుకొని పరిపాలన సాగించాలని అన్నారు.
ప్రజా సమస్యల కోసం తన పోరాటాన్ని ఎలాంటి నిర్బంధాలు, ఆంక్షలు ఆపలేవని దావ వసంత సురేష్ స్పష్టం చేశారు.

వైసీపీ నాయకులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు

ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మీడియాతో మాట్లాడుతూ మేము అన్ని విధాలుగా చెరువులను నింపుతూ, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో తాగునీటి సమస్య రాకుండాముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. కానీ వైసీపీ నాయకులు ఏం చేస్తున్నారు అన్నదే ప్రజలకు అర్థం కావడం లేదు అన్న ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.చెరువులు నింపడం సాధ్యం కాదని గతంలో మాట్లాడిన నాయకులు, ఈరోజు చెరువులు నిండుతున్నప్పుడు ఎందుకు ముందుకు వచ్చి మాట్లాడటం లేదు రైతుల కోసం ధర్నాలు చేసిన నాయకులు, ఇప్పుడు రైతులకు నీటిని ఎలా కాపాడుకోవాలి, భవిష్యత్తులో నీటి పరిస్థితి ఎలా ఉండబోతుంది అనే విషయాలపై ఎందుకు మాట్లాడటం లేదు అని వైసిపి నాయకులను ప్రశ్నించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.వర్షాలు తక్కువగా ఉన్న సమయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మేము ముందుగానే ప్రజలకు చెబుతున్నాం. గ్రామాల్లో తాగునీటి పరిస్థితి, చెరువుల్లో నీటి నిల్వలు, రైతులకు అందుబాటులో ఉన్న నీటి గురించి అధికారులతో కలిసి నిరంతరం సమీక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నాం. పెన్షన్ సమస్య ఉన్నా, తాగునీటి సమస్య ఉన్నా, రైతులకు నీటి అవసరం ఉన్నా ప్రజలు మా దగ్గరకు వస్తున్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు మేము పనిచేస్తున్నాం. ఎవరు ప్రజల మధ్య ఉంటున్నారు? ఎవరు సమస్యలు పరిష్కరిస్తున్నారు? ఎవరు కేవలం విమర్శలు చేస్తున్నారు? అనేది ప్రజలకు స్పష్టంగా తెలుసు అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే కరువు వస్తుందని గతంలో విమర్శలు చేసినోళ్లూ నాయకులు, గత రెండు సంవత్సరాల్లో రైతులకు జరిగిన మేలు, సాగైన పంటలు, అందుబాటులోకి వచ్చిన నీటి గురించి కూడా ప్రజలకు వైసిపి నాయకులు సమాధానం చెప్పాలి.

విమర్శలు చేయడం సులభం. కానీ ప్రజల మధ్యకు వచ్చి సమస్యలను పరిష్కరించడం ముఖ్యం. మేము మాటలతో కాకుండా చెరువులు నింపడం, తాగునీటి భద్రత కల్పించడం, రైతులకు సహకరించడం, అభివృద్ధి పనులు చేయడం ద్వారా మా పని చూపిస్తున్నాం అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.ఇక ఎన్నికల విషయానికి వస్తే, ఒకవైపు అన్ని చోట్ల పోటీ చేస్తామని వైసీపీ నాయకులు చెబుతున్నారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజలను ఎదుర్కోవాల్సింది రాజకీయ పార్టీలే. ప్రజల మధ్యకు వెళ్లి గతంలో ఏం చేశారో, ఇప్పుడు ఏం చేస్తున్నారో చెప్పాల్సిన బాధ్యత కూడా వైసిపి నాయకులదే.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి యూరప్ పర్యటనకు కోర్టు అనుమతి ఇచ్చిన విషయం కూడా ప్రజలకు తెలిసిందే. అయితే స్థానికంగా ప్రజల సమస్యలను ఎదుర్కొని, వారికి సమాధానం చెప్పాల్సింది మాత్రం ఇక్కడి నాయకులే.ఇక అభివృద్ధి విషయానికి వస్తే, గత రెండు సంవత్సరాల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో సుమారు రూ. 8 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాం. ఆళ్లగడ్డ పట్టణానికి మాత్రమే సుమారు రూ. 21 కోట్ల నిధులుకేటాయించబడ్డాయి. రోడ్లు, కాల్వలు, లైట్లు, పార్కులు వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

గతంలో స్థానిక సంస్థలకు, సర్పంచులకు నిధుల విషయంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ప్రజలకు తెలుసు. ఈరోజు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ మార్పును ప్రజలు స్వయంగా చూస్తున్నారు.అందుకే వైసీపీ నాయకులకు నేను చెప్పేది ఒక్కటేకేవలం విమర్శలు చేయకుండా ప్రజల మధ్యకు రండి. మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు ఇప్పుడు మేము ఏం చేస్తున్నాంఅనే విషయాలను ప్రజలకు వివరించండి. ఎన్నికలు వచ్చినప్పుడు ఎవరిని ఎన్నుకోవాలనేది ప్రజలే నిర్ణయిస్తారు. ప్రజల తీర్పును మేము గౌరవిస్తాం. మా దృష్టి మాత్రం ప్రజల సమస్యల పరిష్కారం, తాగునీటి భద్రత, రైతుల సంక్షేమం, ఆళ్లగడ్డ అభివృద్ధిపైనే ఉంటుందని తెలిపిన మీూా భూమా అఖిలప్రియ.

రాయలసీమను సస్యశ్యామలం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 30రిపబ్లిక్ న్యూస్

.రాయలసీమ ప్రాంతాన్ని కరువు ప్రాంతం నుంచి ఉద్యానవన హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఈరోజు చింతకుంట్ల ప్రాంతంలో పర్యటించి, చెరువుల నీటి నిల్వలు, చెరువులను నింపుతున్న తీరును పరిశీలించడం జరిగింది.

మొదట నీరు ఇచ్చాం ఇప్పుడు సంపద సృష్టిస్తాం" అనే లక్ష్యంతో నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ రైతులకు శాశ్వత ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. హంద్రీనీవా వంటి ప్రాజెక్టుల ద్వారా రాయలసీమకు నీటిని అందించడంతో పాటు, ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించేలా సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నాం.అక్టోబర్ 2న మదనపల్లెలో ప్రారంభం కానున్న ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ (ఒఎఐూ) ద్వారా రాయలసీమలో ఉద్యానవన రంగానికి మరింత ప్రాధాన్యత లభించనుంది. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, మెరుగైన వసతులు, మార్కెట్ సౌకర్యాలు కల్పిస్తూ ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఈరోజు రాష్ట్రంలో తాగునీటి సమస్య లేకుండా చేయాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది అన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.మన జిల్లాలో కేసీ కెనాల్, తెలుగుగంగ, కుందూ కింద మూడు ప్రధాన నీటి వనరులు ఉన్న నియోజకవర్గం ఆళ్లగడ్డ. మనం చివరి ప్రాంతంలో ఉండటం వల్ల నీటిని తీసుకురావడం, కాపాడుకోవడం చాలా పెద్ద సవాలు అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ .కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎంఐ కి సంబంధించిన అధికారులతో నిరంతరం మాట్లాడి, రాత్రింబవళ్లు కష్టపడి ఈరోజు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రధాన చెరువుల్లో దాదాపు 80 శాతం చెరువులను నింపుకోగలిగాం. ఇందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసారు.అభివృద్ధి విషయానికి వస్తే, గత రెండు సంవత్సరాల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఆళ్లగడ్డ పట్టణానికి మాత్రమే సుమారు రూ. 21 కోట్ల నిధులు కేటాయించబడ్డాయి. రోడ్లు, కాల్వలు, లైట్లు, పార్కులు వంటి మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నాం.వైసీపీ నాయకులు విమర్శలు చేయడం కంటే ప్రజల కోసం ఏం చేశామన్నది ముఖ్యమైన విషయం. మేము మాటలతో కాకుండా అభివృద్ధి పనులతో సమాధానం చెబుతున్నాం. గతంలో సర్పంచులు, స్థానిక సంస్థలకు నిధులు అందక ఇబ్బందులు ఎదురైన పరిస్థితులతో పోలిస్తే, ఈరోజు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి .

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి, మంత్రి శ్రీ నారా లోకేష్ కి, జిల్లా కలెక్టర్ కి, నీటి వనరుల శాఖలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా ప్రజలందరికీ ఒకటే విజ్ఞప్తిమన చెరువుల్లో నీరు ఉంది కాబట్టి వృథా చేయకుండా ప్రతి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలి. వచ్చే వేసవి వరకు తాగునీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా మనందరం బాధ్యతగా వ్యవహరించాలి అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

బేతపల్లిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

రూ.15 లక్షలతో పనులకు భూమిపూజ

పల్లెల అభివృద్ధి కూటమినే సాధ్యం

గుమ్మనూరు ఈశ్వర్

అనంతపురం/గుత్తి, సెప్టెంబరు 30,(రిపబ్లిక్ న్యూస్):

మండలంలోని బేతపల్లి గ్రామంలో పల్లె పండుగ3.0 కార్యక్రమంలో భాగంగా రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, గుత్తి, పామిడి మండలాల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్థులు, టీడీపీ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.





స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించాలి

గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ పల్లెలు, పట్టణాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. బేతపల్లిలో రూ.15 లక్షలతో సీసీ రోడ్ల పనులు ప్రారంభించడం సంతోషకరమన్నారు.ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు నిర్వహించిన ప్రజాదర్బార్‌లో బేతపల్లి గ్రామస్థులు రోడ్డు నిర్మాణం కోసం వినతిపత్రం అందించారని, వారి అభ్యర్థన మేరకు పనులు మంజూరయ్యాయని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని ఈశ్వర్ కోరారు.గ్రామస్థులు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా పలువురు నాయకులు వచ్చినా రోడ్డు సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుతం సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, యువనేత గుమ్మనూరు ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, బేతపల్లి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గుత్తి మండలం, పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ కమిటీల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆస్తి,ఇవ్వలేదని భర్త, మనుమడు దాడి - పోలీసులకు పిర్యాదు.

రైల్వేకోడూరు సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.

ఆస్తి ఇవ్వలేదని భర్త, కూతురు బిడ్డ దాడి చేశారని శేషక్కగారిపల్లికు చెందిన సాంబయ్యగారి విజయమ్మ రక్షణ కల్పించాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు విజయమ్మ తెలిపారు, ఓబులవారిపల్లి మండలం బి. కమ్మపల్లి పంచాయతీ లోని శేషక్కగారిపల్లి కి చెందిన సాంబయ్య గారి విజయమ్మ పైన ఆమె భర్త సాంబయ్యగారి కిట్టయ్య, కూతురు బిడ్డ మంకు శ్రీనివాసులు తనపై దాడి చేసి కొట్టి తన్నినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు, శేష అక్కగారిపల్లి గ్రామంలో తనకు సంబందించిన 25 సెంట్లు విలువైన భూమి నా అవసర నిమిత్తం అమ్ముకున్నాను, ఆ భూమి తమకు ఇవ్వాలనినువ్వు అమ్మడానికి వీళ్ళేదాని నా ఇంటిమీదికి వచ్చి దాడి చేసి తన్ని కొట్టినారన్నారు, నా మొబైల్ ఫోన్, 10,000 రూపాయల డబ్బు ఇంటి తాలాలు కొట్టి తీసుకున్నరన్నారు, భయపడి పోలీస్ స్టేషన్ కు వెళ్లే క్రమంలో బొమ్మ వరం రోడ్డు మంగంపేట వద్ద మరొకసారి దాడి చేశారని తీవ్ర ఆవేదన విలిబుచ్చారు, అనంతరం ముక్కవారిపల్లి లో జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ను కలిసి తన ఆవేదనను వెలిబుచ్చగా ఆయన పోలీస్ స్టేషన్కు ఫోన్ చేసి ఆమెకు న్యాయం చేయవలసిందిగా సూచించి ఆమెని స్టేషన్ కి వెళ్ళమని సలహా ఇచ్చారని ఆమె తెలిపారు ఆయన సలహా మేరకు స్టేజ్ కి వెళ్లి ఫిర్యాదు చేయడం జరిగినదని ఆమె అన్నారు,అయితేనా భర్తతో కొంతకాలంగా నాకు సంబంధాలు లేవని ఆస్తి కోసం దాడి చేశారని ఆవేదన చెందారు. పోలీస్ స్టేషన్కు వచ్చి వారి నుండి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు, నా ఆస్తి నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను అమ్ముకుంటాను ఎవరు అడగడానికి వీలులేదని దీనిపై విచారించి న్యాయం చేయాలని పోలీసులకు మొరపెట్టుకున్నట్లు ఆమె అన్నారు, న్యాయం చేస్తామని పోలీసులు తెలిపారని ఆమె అన్నారు,



స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి

పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రాంరెడ్డి పిలుపు

గుంతకల్, సెప్టెంబర్ 30: (రిపబ్లిక్ న్యూస్)



స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రాంరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం గుంతకల్లు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికలను సమష్టిగా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని వెంకట్రాంరెడ్డి తెలిపారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా అందరూ ఒకే తాటిపైకి రావాలని సూచించారు.గంటా నరహరితో పాటు పార్టీ కోసం పనిచేయడానికి ముందుకు వచ్చే నాయకులు, కార్యకర్తలను సాదరంగా ఆహ్వానిస్తామని చెప్పారు. అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పట్టణ సి ఐ నాగరాజారావు వెల్లడి

ఆళ్లగడ్డ సెప్టెంబర్ రిపబ్లిక్ న్యూస్



ఆళ్లగడ్డ పట్టణంలోని కోయిలకుంట్ల రోడ్డులో గల గని గుంతలలో బుధవారం గుర్తు తెలయని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆళ్లగడ్డ టౌన్ సిఐ నాగరాజరావు తెలిపారు. పసుపు రంగు టీ షర్టు ధరించిన ఈ వ్యక్తి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని ఆచూకీ తెలిసిన వారు టౌన్ సిఐ కార్యాలయంలో సంప్రదించి వివరాలు అందజేయాలని సీఐ నాగరాజురావు తెలిపారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

స్టేడియం పునరుద్ధరణపై మంత్రి దృష్టి

ఉరవకొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 30,(రిపబ్లిక్ న్యూస్)



ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇండోర్ స్టేడియం పునరుద్ధరణపై మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టి సారించారు.ఈ సందర్భంగా 2017లో ప్రారంభమైన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో నిరుపయోగంగా మారిన భవనాన్ని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం పరిశీలించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులతో కలిసి స్టేడియం పరిస్థితిని పరిశీలించి.. పనులు నిలిచిపోవడానికి కారణాలు, పూర్తిచేయాల్సిన పనులపై ఆరా తీశారు.స్టేడియం నిర్మాణం ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాకపోవడంపై మంత్రి అధికారులతో చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో పనులు కొనసాగక నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిందని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రస్తుతం మిగిలిన పనులను గుర్తించి.. అవసరమైన చర్యలు చేపట్టి స్టేడియాన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభకు కొదవ లేదని మంత్రి అన్నారు. సరైన మైదానాలు, ఇండోర్ సదుపాయాలు, శిక్షణ అందిస్తే యువ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.అసంపూర్తి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. కేవలం భవనం నిర్మించడంతో సరిపెట్టకుండా.. శిక్షణ, క్రీడా సామగ్రి, వినియోగానికి అనువైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.ఎం. మంజుల, క్రీడా ప్రాధికార సంస్థ డీఈ, క్రీడా శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు, పిల్లలపై నేరాలు రక్షణపై అవగాహన కార్యక్రమం

చిప్పగిరి ఎస్ ఐ సి. వెంకట నరసింహులు





చిప్పగిరి, సెప్టెంబర్, 30,(రిపబ్లిక్ న్యూస్) చిప్పగిరి మండలం నేమకల్ గ్రామం నందు బుధవారం మహిళా పిల్లల నేరాలు రక్షక ,అవగాహన కార్యక్రమం ఎస్సై సి వెంకట నరసింహుల ఆధ్వర్యంలో నిర్వహించారు, సైబర్ మోసాలపై నివారణ మహిళల భద్రత ఐవిఆర్ ఫ్లాట్ కాల్స్ రహదారి భద్రతా నియమాలు బాలవివాహాలు నివారణ మరియు ఆన్లైన్ మోసం, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ ను ఉపయోగించడం అంటే అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రెన్యూవల్ కాని మద్యం షాపులకు టెండర్లు వేయండి

ఎక్సయిజ్ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రొహిబిషనర్ మరియు ఎక్సైజ్ జాయింట్ కమిషనర్, (నోడల్ ఆఫీసరు) శ్రీమతి టి.నాగలక్ష్మి కర్నూలు జిల్లా ప్రొహిబిషనర్ మరియు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీమతి పోతుల శ్రీదేవి, కర్నూలు జిల్లా ప్రొహిబిషనర్ మరియు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. హనుమంతరావు, నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎస్. విజయ్ కుమార్ ఆళ్లగడ్డ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయంని సందర్శించి వివరాలు వెల్లడించారు

2026-27 సంవత్సరానికి గాను ఆళ్లగడ్డ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెన్యువల్ కానీ మద్యం షాపులు :4 వాటి వివరములు

1)ఆళ్లగడ్డ రూరల్ 01 షాపు ,2)శిరివెళ్ల మండలం 02 షాపులు ,3)రుద్రవరం మండలం 01షాపు ,

మొత్తం నాలుగు మద్యం షాపులకు టెండర్లను ఆహ్వానించడం జరుగుతున్నది. ఈ ఓపెన్ కేటగిరీకిసంబంధించినటువంటి అప్లికేషన్స్ వేసుకోవడానికి గాను www.oc.hpfsproject.com ని సందర్శించి, ఆన్లైన్ లో గాని, ఆఫ్లైన్ లో గాని, హైబ్రిడ్ మోడ్ లో గాని అప్లై చేసుకొనవచ్చును. అంతేకాకుండా వారు వారి యొక్క మొబైల్ ద్వారా మొదట రిజిస్ట్రేషన్ చేసుకొని, తదుపరి వాళ్ళు ప్రాసెసింగ్ ఫీజ్ కింద 1000 రూపాయలు అప్లికేషన్ ఫీజ్ కింద 3,00,000 రూపాయలు ఆన్లైన్ లో ఎక్కడినుంచైనా కూడా అప్లై చేసుకొనవచ్చును, అప్లై చేసుకొనుటకు 01.10.2026 చివరి తేది .ఈ సమావేశం లో ఆళ్లగడ్డ స్టేషన్ పరిధి లో గల లైసెన్సీదారులు మరియు ఆసక్తి గల అభ్యర్థులు హాజరు అయినారు .

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

రాయలసీమను ప్రపంచ ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు

నంద్యాలలో ఘనంగా హార్టికల్చర్ హబ్ ప్రచార ర్యాలీ - ఆకాశంలో అద్భుతంగా డ్రోన్ షో

రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఉద్యాన రంగానికి నూతన ఊపు - మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి


నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 30 (రిపబ్లిక్ న్యూస్)
రాయలసీమ ప్రాంతాన్ని వ్యవసాయ-ఉద్యాన రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసి, ప్రపంచస్థాయి ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్' కార్యక్రమానికి నంద్యాల జిల్లాలో విస్తృత ప్రచారం కల్పించారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు నిర్వహించిన భారీ ట్రాక్టర్ ప్రచార ర్యాలీని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ నూరజ్ ధనుంజయ్ లు ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నూనెపల్లె, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, టెక్కె మార్కెట్ యార్డు మీదుగా ఇండోర్ స్టేడియానికి చేరుకుంది. ర్యాలీలో జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ నూరజ్ ధనుంజయ్ ట్రాక్టర్లపై ప్రయాణిస్తూ "హార్టికల్చర్ హబ్-రాయలసీమ రైజింగ్" నినాదాలతో ఉత్సాహాన్ని నింపారు. 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్-రాయలసీమ రైజింగ్' లక్ష్యాలు, ఉద్యాన రంగ అభివృద్ధి ద్వారా రైతులకు లభించే అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించారు.



జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఆద్యంతం వీక్షించి అభినందించారు.

ఉద్యాన పంటలతో రైతులకు మరింత లాభదాయకమైన అవకాశాలు: మంత్రి ఎన్ఎండీ ఫరూక్

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతాన్ని, ముఖ్యంగా మదనపల్లె పరిసర ప్రాంతాలను ఉద్యానవన హబ్‌గా అభివృద్ధి చేయాలనే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. సాధారణ వ్యవసాయంతో పోలిస్తే ఉద్యాన పంటల ద్వారా రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు లభించే అవకాశం ఉన్నందున ఉద్యాన రంగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమలోని 10 జిల్లాల్లో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఉద్యాన రంగాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. మామిడి, డ్రాగన్ ఫ్రూట్, జామ, సపోటా తదితర వివిధ రకాల పండ్ల తోటల సాగుకు ఈ ప్రాంతంలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వంటి ప్రతికూల పరిస్థితులు



ఉన్నప్పటికీ కాలువల ద్వారా నీటిని అందించడం, భూగర్భ జలాలను పెంపొందించేందుకు బోర్ బావుల రీచార్జ్ చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. రానున్న వేసవి కాలంలో ఎండల తీవ్రత, నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని, పండ్ల తోటలకు మరియు తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

రాయలసీమను అంతర్జాతీయ ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: కలెక్టర్ జి. రాజకుమారి

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఉద్యాన రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు కల్పించడంతో పాటు రాయలసీమను అంతర్జాతీయ స్థాయి ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దడమే 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్-రాయలసీమ రైజింగ్' ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంపై నంద్యాల జిల్లాలో గత



వారం రోజులుగా విస్తృత ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యవసాయ-ఉద్యాన రంగ నిపుణులు, వివిధ వర్గాల భాగస్వామ్యంతో ఆధునిక సాగు విధానాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్, ఎగుమతులు తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు వివరించారు.

అక్టోబర్ 2న మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రారంభం

అక్టోబర్ 2న మదనపల్లెలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్- రాయలసీమ రైజింగ్' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని కలెక్టర్ తెలిపారు. అదే సందర్భంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు భూమిపూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఉద్యాన, నీటిపారుదల, గ్రామీణ మౌలిక వసతులను సమన్వయంతో అభివృద్ధి చేస్తూ ఉద్యాన ఉత్పత్తులకు అంతర్జాతీయ ప్రమాణాలు కల్పించడం, విలువను పెంచడం, మార్కెట్ అనుసంధానాన్ని బలోపేతం చేయడం, ఎగుమతులను ప్రోత్సహించడం వంటి అంశాలకు ఈ కార్యక్రమంలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఉద్యాన రంగానికి భారీ ప్రోత్సాహం

'గ్లోబల్ హార్టికల్చర్ హబ్రా-యలసీమ రైజింగ్'లో భాగంగా మొత్తం రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులను సమీకరించే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో రూ.40 వేల కోట్లు ప్రభుత్వ పెట్టుబడిగా, మరో రూ.60 వేల కోట్లను ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా సమీకరించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఈ పెట్టుబడుల ద్వారా



కోల్డ్‌చైన్, గ్రామీణ లాజిస్టిక్స్, ఆధునిక ప్యాకేజింగ్, ప్రాసెసింగ్, ధృవీకరణ, మార్కెటింగ్ తదితర మౌలిక వసతులను బలోపేతం చేసి రైతుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు.

మూడు సంవత్సరాల్లో మరో 50 వేల హెక్టార్లకు ఉద్యాన సాగు విస్తరణ

నంద్యాల జిల్లాలో ప్రస్తుతం సుమారు 49 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయని, రాబోయే మూడు సంవత్సరాల్లో మరో 50 వేల హెక్టార్లకు ఉద్యాన సాగును విస్తరించాలనే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు కలెక్టర్ తెలిపారు. పంటల వైవిధ్యీకరణ, ఆధునిక సాగు విధానాలు, సూక్ష్మ సేద్యం, నాణ్యమైన నాటుసామగ్రి, పంట అనంతర నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఉద్యాన రంగాన్ని మరింత లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

15 క్లస్టర్లుగా విభజించి మూడు దశల్లో అమలు

జిల్లాలో ఉద్యాన రంగ అభివృద్ధిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు జిల్లాను 15 క్లస్టర్లుగా విభజించి మూడు దశల్లో కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి క్లస్టర్‌లో నేలల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, పంటల అనుకూలత, రైతుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. రైతుల భాగస్వామ్యంతో ఉద్యాన ఉత్పత్తుల ఉత్పాదకత, నాణ్యత, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేసి నంద్యాల జిల్లాను రాయలసీమ ఉద్యాన అభివృద్ధిలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు

కర్నూలును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి పనులు

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి టీజీ భరత్ గుప్త

ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే కర్నూలు అభివృద్ధి సాధ్యమని వెల్లడి

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 30)
కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్త తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.15వ ఆర్థిక సంఘం నిధులతో 17వ వార్డు చాణిక్యపురి కాలనీలో 1000 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు మంత్రి పూజలు నిర్వహించి పైలాన్‌ను ఆవిష్కరించారు. అలాగే చాణిక్యపురి కాలనీ, లక్ష్మీ గార్డెన్స్, జోహరాపురం ప్రధాన రహదారి వెంట 160 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన హెచ్‌డీ పైపులైన్ ఏర్పాటు, 18వ వార్డు జోహరాపురంలోని వివిధ ప్రాంతాల్లో 160, 110 మిల్లీమీటర్ల పైపులైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. సంప్ నుంచి కేఎస్ కెనాల్ బ్రిడ్జి వరకు 315 మిల్లీమీటర్ల వ్యాసం



కలిగిన హెచ్‌డీపీ పైపులైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా కర్నూలు మెడికల్ కాలేజ్ గేట్ నుంచి పాషా మసీదు వరకు కాలిబాట నిర్మాణం, అమీలియా ఆసుపత్రి నుంచి ఉల్చాల రోడ్డు వరకు రహదారి విస్తరణ, సుంకేసుల రోడ్డులో విజయనగర్ కాలనీ వరకు రహదారి విస్తరణ పనులకు కూడా మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనుల కోసం రూ.82 లక్షల విలువైన నిధులను వెచ్చించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ గుప్త మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం, రహదారులు, కాలిబాటలు, మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని



తెలిపారు.ప్రజల సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని మంత్రి కోరారు. నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.కార్యక్రమాల్లో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, సూపరింటెండింగ్ ఇంజనీర్ రమణమూర్తి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పరమేష్ యాదవ్, గున్న మార్క్, రామాంజనేయులు, పద్మలత రెడ్డి, నాయకులు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలును స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యం

రూ.3.50 కోట్లతో స్టేడియంలో అభివృద్ధి పనులు మంత్రి టీజీ భరత్ గుప్త

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 30)
కర్నూలు నగరాన్ని క్రీడలకు ప్రధాన కేంద్రంగా, స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్త తెలిపారు. కర్నూలు స్టేడియంలో రూ.3.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, మరికొన్ని పనులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.కర్నూలు స్టేడియంలో నూతనంగా అభివృద్ధి చేసిన ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను మంత్రి టీజీ భరత్ గుప్త ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. వాలీబాల్, పికిల్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ కోర్టులను అభివృద్ధి చేయడంతో పాటు సింథటిక్ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.క్రీడాకారులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్టేడియంలోని



సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని మంత్రి తెలిపారు. స్పోర్ట్స్ హాస్టల్ ఇక్కడి నుంచి తరలిపోకుండా చర్యలు తీసుకున్నామని, జిమ్ సెంటర్‌కు సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించామని చెప్పారు. క్రీడల అభివృద్ధికి టీజీవీ కుటుంబం మొదటి నుంచి సహాయ సహకారాలు అందిస్తూ వస్తోందని పేర్కొన్నారు.ఇటీవల నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన అన్ని అడ్డంకులను తొలగించి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని మంత్రి తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేసేందుకు



సామాజిక మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించాలని మీడియా ప్రతినిధులకు సూచించారు. అనంతరం మంత్రి టీజీ భరత్ గుప్త ఫుట్‌బాల్ మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకుని, ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను స్వయంగా గోల్ కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీఎస్‌డీవో భూపతి రావు, చైర్మన్ రాజశేఖర్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, శ్రీకాంత్ సుధీర్, క్రీడల కోచ్‌లు, వివిధ క్రీడా సంఘాల అధ్యక్షులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

డ్రోన్ షో..

"గ్లోబల్ హార్టికల్చర్ హబ్" పై అవగాహన

ఆధునిక సాంకేతికతతో రైతులకు మరింత లాభాలు -ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం వ్యవసాయం,సెప్టెంబర్ 30,(రిపబ్లిక్ న్యూస్)
ఉద్యాన రంగంలో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చే లక్ష్యంగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల క్రీడా ప్రాంగణం బుధవారం రాత్రి ప్రత్యేక వాతావరణాన్ని సంతరించుకుంది. "గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌రాయలసీమ రైజింగ్" ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా డ్రోన్ ఫ్లై షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కలిసి డ్రోన్ ఫ్లై షోను ప్రారంభించారు. డ్రోన్ల ప్రదర్శనతో పాటు ఉద్యాన పంటలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతికత వినియోగం, రాయలసీమలో ఉద్యాన రంగానికి ఉన్న అవకాశాలను వివరిస్తూ ప్రదర్శించిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

ఉద్యాన పంటల ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమలో ఉద్యాన రంగానికి అపారమైన అవకాశాలున్నాయన్నారు. ఇక్కడి వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, రైతుల అనుభవాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తే ఉద్యాన పంటల ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం అందే అవకాశం ఉందన్నారు.సాగులో డ్రోన్ల వినియోగం, ఆధునిక సాంకేతిక పద్ధతులు రైతులకు చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడంతో సాగు ఖర్చులను నియంత్రించడంతో పాటు ఉత్పాదకత పెంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.పంట పండించడం ఒక్కటే కాకుండా.. ఉత్పత్తికి మార్కెట్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ఆధునిక ప్రాసెసింగ్, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందితే ఉద్యాన రంగం మరింత బలోపేతమవుతుందని ప్రసాద్ పేర్కొన్నారు. రాయలసీమను "గ్లోబల్ హార్టికల్చర్ హబ్"గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాయలసీమ రైతుల సామర్థ్యాన్ని సాంకేతికతతో అనుసంధానిస్తే ఈ ప్రాంత ఉద్యాన రంగానికి కొత్త అవకాశాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.

రాయికల్ నుండి సిరిసిల్ల సీఎం రేవంత్ రెడ్డి సభకు సంజయ్ సేన పల్లికొండ గంగాధర్ ఆధ్వర్యంలో100 మంది యువకులు

రాయికల్ మండలం సెప్టెంబర్,30(రిపబ్లిక్ న్యూస్)



సిరిసిల్లలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్ ఆధ్వర్యంలో 100 మంది యువకులశీ సభకు తరలి వెళ్తున్నామాని పల్లికొండ గంగాధర్ తెలిపారు పట్టణ యువకులు రేవంత్ రెడ్డి చేసిన మంచి పనులకు ఆకర్షితులై సభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని ఆయన అన్నారు అలాగే ఐదు, ఆరు,ఏడు వార్డుల మునిసిపల్ మాజీ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజీ మహేందర్ బాబు ఆధ్వర్యంలో కొన్ని బస్సులలో యువకులను తీసుకెళు న్నానని ఆయన అన్నారు

సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల బహిరంగ సభకు వస్తున్న సందర్భంగా రాయికల్ పట్టణ బిజెపి నాయకులను ముందస్తు అరెస్టులు

రాయికల్ మండలం సెప్టెంబర్,30(రిపబ్లిక్ న్యూస్)




సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల బహిరంగ సభకు వస్తున్న సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కురుమల్లారెడ్డిని, నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం జరిగింది

ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ మమ్ములను అరెస్టు చేయడశీ ఏశీతవరకు సమంజసమని రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాడని ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చమని అడగడం తప్ప ఎందుకు ఇలాంటి వాగ్దానాలు ఏశీదుకు చేయాలి అని తీవ్రంగా విమర్శించారు

గోవుల సంరక్షణ తో చెడు వ్యసనాలు దూరం!!

గో విజ్ఞాన రాయికల్ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో పరీక్షలు



రాయికల్ మండలం సెప్టెంబర్,30(రిపబ్లిక్ న్యూస్)

యువత లో చెడు వ్యసనాలు దూరం చేసేందుకు గోవుల సంరక్షణ అత్యంత ఉపయుక్తంగా ఉంటుందని గో సేవా ఖండ ప్రముఖ్ శ్రీ గద్దె సుమన్ అన్నారు జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం గో విజ్ఞాన పరీక్షలు నిర్వహించారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవు యొక్క పాలు, పెరుగు,నెయ్యి, మూత్రం,పేడ ల సమ్మేళనం పంచగవ్యంగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు.ఈపరీక్షల నిర్వహణ లో ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్ ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ,ఎం.పద్మ, జి.తరంగిణి,యం.రమ తదితరులు పాల్గొన్నారు

రాయికల్ సొసైటీ కి 12 లక్షల బకాయి నిధులను వెంటనే చెల్లించాలి మునిసిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ కు వినతిపత్రం ఇచ్చిన సింగల్ విండో అధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి

రాయికల్ మండలం సెప్టెంబర్,30(రిపబ్లిక్ న్యూస్)



జగిత్యాల జిల్లా రాయికల్ సహకార సంఘానికి మున్సిపాలిటీ నుంచి బకాయి ఉన్న రూపాయలు 12 లక్షలకు పైగా నిధులను త్వరగా చెల్లించాలని కోరుతూ సంఘం పాలకవర్గ సభ్యులు, రైతులు మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడు కు వినతిపత్రం అందజేశారు, కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి, అందుబాటులో ఉన్న నిధుల మేరకు ప్రతి నెల కొంత మొత్తాన్ని చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి సీఈవో రవికుమార్ రైతులన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య..

రేణిగుంట సెప్టెంబర్ 30(రిపబ్లిక్ న్యూస్)



రేణిగుంట మండలం, వెదళ్లచెరువు ఎస్టీ కాలనీకి చెందిన కొడవల కిరణ్ (30), తండ్రి కె. రామచంద్రయ్య, మద్యానికి బానిసై పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రేణిగుంట సీఐ జయచంద్ర తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెదళ్లచెరువు ఎస్టీ కాలనీకి చెందిన కె. కిరణ్ వ్యవసాయ కూలి పనులతో పాటు అప్పుడప్పుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి తీవ్రమైన మద్యపాన వ్యసనం ఉండటంతో మద్యం మానుకోవాలని భార్య మౌనిక తరచూ వారించేది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చేవి. ఈ క్రమంలో ఈ నెల 28-09-2026 రాత్రి సుమారు 8.50 గంటల సమయంలో కిరణ్ మద్యం మానివేయలేక, జీవితంపై విరక్తితో మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు.ఇంటి ముందు అపస్మారక స్థితిలో పడి ఉన్న కిరణ్‌ను గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో వెంటనే తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో 29-09-2026 సాయంత్రం 4.56 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడి భార్య చెరుకూరు మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం వారి రక్త బంధువులకి అప్పగించడమైనది, తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రాయికల్ లో విశ్వశాంతి పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు గోవిజ్ఞాన పరీక్షలనిర్వహణ

రాయికల్ మండలం సెప్టెంబర్,30(రిపబ్లిక్ న్యూస్)





జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో గోవిజ్ఞాన పరీక్షలు నిర్వహించరు

విద్యార్థినీవిద్యార్థులకు గోవుల పట్ల అవగాహన భారతీయ సంస్కృతి, సాంప్రదాయ గో సంరక్షణ పై ప్రాధాన్యతపై జ్ఞానాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ పరీక్షను నిర్వహించినట్లు స్కూల్ మేనేజ్మెంట్ తెలిపారు

ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా పరీక్షల పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మంలో గోవును కేవలం ఒక జంతువుగా కాకుండా, 'గోమాత' అని పిలుస్తూ సాక్షాత్తూ లక్ష్మీదేవి స్వరూపంగా పూజిస్తాము. "గావో విశ్వస్య మాతరః" అంటే ఆవు ప్రపంచానికే తల్లి అని మన పెద్దలు చెప్పారు గోవులో ముక్కోటి దేవతలు కొలువై ఉంటారని మన నమ్మకం.కానీ, గోవు కేవలం పూజలకే పరిమితం కాదు. దీని వెనుక ఎంతో గొప్ప సైన్స్ మరియు విజ్ఞానం దాగి ఉన్నాయి.దేశీయ ఆవు పాలు అమృతంతో సమానం. ఇందులో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి పిల్లల మేధోశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఆయుర్వేదంలో గోమూత్రానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో ఎన్నో రకాల యాంటీ-బయాటిక్ గుణాలు ఉన్నాయి. దీనిని క్యాన్సర్, చర్మరోగాలు, మధుమేహం వంటి అనేక వ్యాధుల నివారణకు ఔషధంగా ఉపయోగిస్తారు.

ఆవు పేడ శ్రేష్ఠమైన ప్రకృతి ఎరువు. రసాయన ఎరువుల వల్ల విషపూరితమవుతున్న భూములను రక్షించడానికి గోమయం ఎంతో అవసరం

ఇది భూమిలో సూక్ష్మజీవులను పెంచి, పంటలకు బలాన్ని ఇస్తుంది. ఇంటి ముందు ఆవు పేడ నీటితో కల్లాపి చల్లడం వల్ల హానికరమైన బ్యాక్టీరియా నశిస్తుంది.

ఆవు పాలు, పెరుగు, నెయ్యి, గోమూత్రం, గోమయం... ఈ ఐదింటి కలయికను 'పంచగవ్యం' అంటారు. ఇది శరీరానికి, ప్రకృతికి గొప్ప సంజీవనిలా పనిచేస్తుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాయికల్ గో సేవ ఖండ ప్రముఖ్ శ్రీగద్దె సుమన్ మరియు పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్ ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, అఫ్సర్ , రజిత, సంజన, ఇందుజ, మంజుల, స్రవంతి, కవిత ,సాయిహర్ష,శివాని, సౌజన్య ,కళ్యాణి,మాలతి, అహల్య,గాయత్రి,గీత రాణి, ప్రవళిక,కావ్య,ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తూ పల్లె పండగ.

ముక్కా రూపానంద రెడ్డి.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 30 రిపబ్లిక్ న్యూస్.









ఆర్థిక అభివృద్ధికి పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తూ మూడో విడత పల్లె పండగ కార్యక్రమం కన్నుల పండుగగా ఓబులవారిపల్లి మండలం పాపిరెడ్డి పల్లె గ్రామంలో జరిగినది, ఉపాధి హామీ పథక నిధులతో రెండు పశువుల పాకలను నిర్మించుటకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగినది ఈ కార్యక్రమం కూడా చైర్మన్ రైల్వేకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రూపానంద రెడ్డి, జనసేన శాసనసభ్యులు ఆరవ శ్రీధర్తో కలిసి శంకుస్థాపన చేశారు, సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓటమి నాయకులు గ్రామీణ ప్రాంతాల్లో పల్లెల వికాసానికి గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక అభివృద్ధికి కోటను ప్రభుత్వం చేయూతనిస్తోందని ఆ దిశగా కుటుంబ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు, గ్రామీణ ప్రాంత ప్రజలకు జీవనోపాధి నిచ్చే పశుపోషణను గణనీయంగా పెంచేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు కల్పిస్తామన్నారు, పాకల నిర్మాణం ద్వారా పశువులకు రక్షణతో పాటు పాడి రైతులకు ఆర్థిక అభివృద్ధి ప్రయోజనం చేకూరుతుందన్నారు, ప్రజల జీవనోపాధి సంక్షేమమే పరమావధిగా పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రాధాన్యం ఉన్న అన్ని కార్యక్రమాలను దశలవారీగా అమలు చేయడం జరుగుతుందన్నారు, కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎంవీఎన్ రాజేంద్ర, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సామాజిక కార్యకర్త వేమన సుబ్రహ్మణ్యం నాయుడు, కల్లా శ్రీనివాసులు, పున్నాటి వాసుదేవ రెడ్డి, మైనారిటీ నాయకుడు అక్బర్ బాషా, జలవనరుల యాజమాన్య సంస్థ ప్రతినిధులతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు వారి శాఖలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

నూనెపల్లె అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సీఎం చంద్రబాబు.

సమస్య మీది కాదు నాది పరిష్కారం అయ్యేంత వరకు వదలను.

ఈ రోజే మీ సమస్య పై అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం.

గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వం నూనెపల్లె అభివృద్ధిని విస్మరించింది.

ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీతో నూనెపల్లె



నంద్యాలసెప్టెంబరు 30(రిపబ్లిక్ న్యూస్) :

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, నూనెపల్లె వద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం తాను ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అవసరమైన నిధుల విడుదలకు పరిపాలన అనుమతి తీసుకున్నానని, నూనెపల్లె అభివృద్ధి విషయంలో మా మంచి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమస్య మీది కాదు నాది వాటిని పరిష్కరించెంత వరకు వదిలేదని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంపీ బైరెడ్డి శబరి స్పష్టం చేశారు.నూనెపల్లె అభివృద్ధి కమిటీ పేరుతో సీనియర్ న్యాయవాది బి. శంకరయ్య ఆధ్వర్యంలో నూనెపల్లి వద్ద రైల్వే అండర్ పాస్ వంతెన ఏర్పాటు చేయాలని రెండు రోజులుగా సామూహిక దీక్ష చేస్తున్నారు. బుధవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నూనెపల్లిలోని దీక్ష శిబిరం కు వచ్చి నూనెపల్లె అభివృద్ధికి, రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కు ఉమ్మడి ప్రభుత్వం తీసుకుంటున్న అన్ని విషయాలు వివరించారు. తాను, మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ నూనెపల్లి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కోసం ఇప్పటి వరకు చేసిన, చేపట్టబోయే అంశాలను నూనెపల్లె అభివృద్ధి కమిటీకి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.మరి కొద్దిసేపట్లో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన రైల్వే, మున్సిపల్, రెవిన్యూ, ఆర్ అండ్ బి తదితర అన్ని శాఖల అధికారులతో కీలక సమావేశం ఏర్పాటు చేసి, వాటి సమాచారం రేపటి లోగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు మీ సమస్య పరిష్కారం కోసం పైల్ వెళుతుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. చిన్న ఉద్యమం అయినా ఎంపీ డాక్టర్ శబరి వచ్చారన్నారు. ఇది చిన్నది కాదు, మీ కష్టం నాకు తెలుసు ఇదేళ్లు వైసీపీ పట్టించుకోలేదు. మీ బిడ్డగా తాను ఎంపీ అయిన రెండు నెలలకే ఢిల్లీలోకేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికి రెండేళ్ల క్రితం తీసుకొల్లా,సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలనీ కేంద్ర రైల్వే మంత్రి నీ, సీఎం చంద్రబాబును కోరా అన్నారు. ఎంపీ గా తాను, మంత్రి ఫరూక్, నంద్యాల జిల్లాకలెక్టర్ బాగా స్పందించాం. ఈ రోజు అన్ని శాఖల అధికారుల సమావేశం ఏర్పాటు కుసీఎం చంద్రబాబు స్పందించారురేపటి లోగా సీఎం ఆఫీస్ కు వెళు తుంది.

మంత్రి ఫరూక్ నేను కలిసి మీ సమస్య పరిష్కరిస్తాం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా నూనెపల్లె అభివృద్ధి కమిటీ పేరుతో చేస్తున్న మీ ఐక్యతకు అభినందనలనీ, మీ సహకారం మా ఉమ్మడి ప్రభుత్వం కు ఎంతో అవసరం.పని కానప్పుడు దీక్షచేద్దాం.

మీది కాదు ఇది నా బాధ్యత మీరూ దీక్ష విరమణ చేయండని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరగానే ఒక్కసారిగా వందలాది మంది నూనెపల్లె ప్రజలు, ఉద్యమకారులు హర్ష ధ్వనాలతో ఆహ్వానించి, దీక్ష విరమించారు. దీక్ష శిబిరం నుంచి పక్కనే ఉన్న నూనెపల్లె రైల్వే అండర్ పాస్ వంతెన అవసరం అయ్యో రైల్వే ట్రాక్ ను ఉద్యమకారులతో కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పరిశీలించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు
యువజన ఉత్సవాలు చక్కటి వేదిక

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత కీలక భాగస్వాములు కావాలి

చదువుతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

యువత అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 30 (రిపబ్లిక్ న్యూస్)
యువతలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికితీసి వారికి తగిన అవకాశాలు కల్పించేందుకు యువజన ఉత్సవాలు చక్కటి వేదికగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత చురుకైన భాగస్వాములుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్ట ప్రాంతంలోని ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన ప్రతిభ ప్రదర్శన కార్యక్రమాన్ని నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు భూమా అఖిలప్రియతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. యువజన ఉత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గీతం, నుక్కడ్ నాటకం, చిత్రలేఖనం, కవితా రచన తదితర పోటీలను నిర్వహించారు. యువత తమ కళా, సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించేలా ఈ పోటీలు వేదికగా నిలిచాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. యువతలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలు, సృజనాత్మకత, కళా–సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేందుకు యువజన ఉత్సవాలు దోహదపడతాయని అన్నారు. యువత చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సృజనాత్మక ఆలోచనా విధానం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అనుభవాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని తమ లక్ష్యాల సాధనకు క్రమశిక్షణతో కృషి చేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువతకు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువతలోని ప్రతిభను ప్రోత్సహించేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, నిర్వాహక బృందాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు.





దేశ ప్రగతిలో యువత కీలక భాగస్వాములు: ఎంపీ బైరెడ్డి శబరి
యువతలోని ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి, వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే యువజన ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. రాయలసీమ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో యువతకు అందుబాటులోకి వస్తున్న ఉద్యోగ, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

యువత ఆలోచనలు, ఆకాంక్షలకు ప్రోత్సాహం అవసరం: ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
ఆళ్లగడ్డ శాసనసభ్యులు భూమా అఖిలప్రియ మాట్లాడుతూ.. దేశ, సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. యువత ఆలోచనలు, ఆకాంక్షలు, ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాను సానుకూల కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతల్లో ఒకటని తెలిపారు. పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచే చర్యలు కొనసాగుతున్నాయన్నారు. రాయలసీమలో మౌలిక వసతులు, పరిశ్రమలు అభివృద్ధి చెందితే యువతకు సొంత ప్రాంతంలోనే ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. యువత తమ విద్య, నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రెవెన్యూ లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి
బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 30 (రిపబ్లిక్ న్యూస్)
202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ రెవెన్యూ ఆర్జించే శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతి, బకాయిల వసూళ్లు, శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు రెవెన్యూ వసూళ్ళు పై సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి శాఖకు నిర్దేశించిన త్రైమాసిక రెవెన్యూ లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాల సాధనకు చేపడుతున్న చర్యలు, ఎదురవుతున్న సమస్యలను శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు. రెవెన్యూ బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్దిష్ట లక్ష్యాలను సాధించేలా అధికారులు సమర్థవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం ద్వారా రెవెన్యూ వసూళ్లను మరింత మెరుగుపరచాలని, అమలు ప్రక్రియలో ఎదురయ్యే అంతరశాఖ సమస్యలను పరస్పర సమన్వయంతో పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర లక్ష్యాల సాధనకు స్పష్టమైన కార్యాచరణ వ్యూహంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అధికారులు తమ శాఖలకు సంబంధించిన త్రైమాసిక రెవెన్యూ లక్ష్యాలు, సాధించిన ప్రగతి, బకాయిల వసూళ్ల పరిస్థితి, అంతర్ శాఖ సమన్వయ సమస్యలు, ప్రస్తుత సంవత్సర లక్ష్యాల సాధనకు చేపడుతున్న చర్యలు తదితర అంశాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమీక్ష సమావేశానికి కమర్షియల్ ట్యాక్స్, పోలీస్, మైన్స్ అండ్ జియాలజీ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ట్రెజరీ అండ్ అకౌంట్స్, లీగల్ మెట్రాలజీ, రిజిస్ట్రేషన్, విద్య, రవాణా, ప్రజా రవాణా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలకు చెందిన అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మైనారిటీల కోసం "రిఫార్మ్ ఉత్సవ్"
విజయవాడలో అక్టోబర్ 8న తొలిసారిగా ఎన్.ఎం.డి.ఎఫ్.సి ద్వారా ఔట్రీచ్ ప్రోగ్రామ్
మైనారిటీల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధే ధ్యేయం -భారీగా తరలిరావాలని పిలుపునిచ్చిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్

అమరావతి,సెప్టెంబరు 30(రిపబ్లిక్ న్యూస్) :
కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అనుబంధమైన 'నేషనల్ మైనారిటీస్ డెవలప్‌మెంట్ & ఫైనాన్స్ కార్పొరేషన్' (ఎన్ ఎం డి ఎఫ్ సి) ఆధ్వర్యంలో అక్టోబర్ 8న మైనారిటీల కోసం "రిఫార్మ్ ఉత్సవ్"భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.తొలిసారిగా విజయవాడలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక "రిఫార్మ్ ఉత్సవ్" నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. మైనారిటీ వర్గాల సామాజిక, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నతమైన ఉద్దేశ్యంతో సంక్షేమ పథకాలను, తక్కువ వడ్డీతో కూడిన రాయితీ రుణాలను అందిస్తున్నాయని తెలిపారు.అయితే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సరైన సమాచారం లేకపోవడం, అవగాహన లేకపోవడం వల్ల చాలామంది ఈ అవకాశాలను అందుకోలేకపోతున్నారన్నారు.ఈ లోటును భర్తీ చేయడమే లక్ష్యంగా 'రిఫార్మ్ ఉత్సవ్' నిర్వహించడం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఇందులో భాగంగా మైనారిటీ మహిళల ఆర్థికాభివృద్ధికి, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు, విద్యార్థుల ఉన్నత చదువులకు లభించే వివిధ ప్రభుత్వ రుణాలు, శిక్షణా కార్యక్రమాలపై ఎన్ ఎం డి ఎఫ్ సి తరపున జాతీయ స్థాయి అధికారులు నేరుగా అవగాహన కల్పిస్తారని తెలిపారు. లబ్ధిదారులకు, ప్రభుత్వానికి మధ్య ఇదొక వారధిలా పనిచేస్తుందన్నారు. విజయవాడలో అంబేద్కర్ కళా వేదికలో జరగబోయే ఈ మెగా అవగాహన సదస్సుకు రాష్ట్రంలోని మైనారిటీ సోదర సోదరీమణులు, నిరుద్యోగ యువతీ యువకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులు అందరూ భారీ సంఖ్యలో తరలిరావాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సువర్ణావకాశాన్ని మైనారిటీలందరూ సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, హాజరయ్యే ప్రతినిధులకు,ప్రజలకు తగిన ఏర్పాట్లు చేయాలని మైనారిటీ సంక్షేమ కార్యదర్శిని మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులను మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశించారు.



గ్యాస్ సిలిండర్లను సకాలంలో వినియోగదారులకు డెలివరీ చేయాలి
ఐవిఆర్ఎస్ కాల్స్‌లో నెగెటివ్ ఫీడ్‌బ్యాక్‌కు తావులేకుండా సేవలు అందించాలి
జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్





నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 30 (రిపబ్లిక్ న్యూస్)జిల్లాలో గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రక్రియ, వినియోగదారులకు అందుతున్న సేవలపై జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సివిల్ సప్లైస్ అధికారి రవిబాబు, గ్యాస్ ఏజెన్సీ, డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ....గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు సకాలంలో, నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలని అన్నారు. గ్యాస్ సరఫరా, డెలివరీలో జాప్యం కారణంగా వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ఏజెన్సీ డీలర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వినియోగదారుల నుంచి నిర్వహించే ఐవిఆర్ఎస్ కాల్స్‌లో ఎటువంటి నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ రాకుండా గ్యాస్ ఏజెన్సీలు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా ఏజెన్సీ యాజమాన్యాలు పర్యవేక్షణ చేసుకోవాలని అన్నారు. గ్యాస్ సిలిండర్లను డెలివరీ చేసే సిబ్బంది డెలివరీ బాయ్స్ వినియోగదారులతో మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించడంతో పాటు, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని తెలిపారు. గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, సిబ్బంది వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుకే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదా బాయి

నంద్యాల బ్యూరో, 30 (రిపబ్లిక్ న్యూస్)
నంద్యాలలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం లో పిసిపిఎన్డిటి డిఎల్ఎసి కమ టి మీటింగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారద బాయి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే నిర్వాహకుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు జైలు శిక్షలు తప్పదని హెచ్చరించారు. చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం ప్రోత్సహించడం నేరమన్నారు. సమాజానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఆడబిడ్డ ముఖ్యమని ఆడబిడ్డను రక్షించే బాధ్యత సమాజంలోని ప్రతి పౌరునికి ఉందని తెలియజేశారు స్కానింగ్ సెంటర్లలో ధరల బోర్డులు ప్రదర్శించాలని సూచించారు ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లైన డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ శ్రవణ్ కుమార్ , జిల్లా ఎక్జిక్యూషన్ అండ్ మాస్ మీడియా అధికారి మల్లేపల్లి పామన్న. డాక్టర్ సలీమున్నీసా బేగం నంద్యాల బర్డ్ ఎన్జీవోప్రతినిధి వినయ్ బాబు, వంశీ పాల్గొన్నారు.



మద్యం లైసెన్స్ పునరుద్ధరణకు దరఖాస్తులు
జాయింట్ కమిషనర్ టి.నాగ లక్ష్మి నోడల్ ఆఫీసర్



నంద్యాల క్రైం, సెప్టెంబర్ 30, (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల, కర్నూలు మద్యం లైసెన్స్ పునరుద్ధరణ, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి అధికారిక నవీకరణను అందించాలనుకుంటున్న అని జాయింట్ కమిషనర్ టి.నాగ లక్ష్మి నోడల్ ఆఫీసర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయమైన, పారదర్శక వ్యవస్థను నిర్ధారించడానికి, మేము కార్టెల్లు, బినామీ ప్రయోజనాలకు సంబంధించిన లైసెన్సును తొలగించాము. దీని ఫలితంగా 20% పునరుద్ధరణ కాని రేటు ఉండగా, 80% లైసెన్సులు విజయవంతంగా పునరుద్ధరించబడ్డాయి, 36.32 కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించాయి. ప్రస్తుతం 14 మండలాలు, రెండు మునిసిపాలిటీలు, ఒక పట్టణ పంచాయతీలో 27 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. జిల్లా కలెక్టర్, కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా గెజిట్ జారీ చేయబడింది. ఆఫ్లైన్, ఆఫ్లైన్, హైబ్రిడ్ ఛానెళ్ల ద్వారా 24వ తేదీ నుండి 1వ తేదీ అర్ధరాత్రి వరకు దరఖాస్తులు అంగీకరించబడతాయి. అధికారిక డ్రా 5 వ తేదీన ఉదయం 8:00 గంటలకు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించబడుతుంది. పక్షపాతం లేని ప్రక్రియకు మేము కట్టుబడి ఉన్నాము. రాజకీయ బెదిరింపులను ఎదుర్కొంటున్న ఏ దరఖాస్తుదారు అయినా రక్షణ కోసం 8008828467 వద్ద నేరుగా జిల్లా అధికారి అయినటువంటి రవి కుమార్ ని సంప్రదించమని ప్రోత్సహిస్తున్నారు. మునుపటి పనితీరుకు సంబంధించి, నంద్యా జిల్లా 2024-26 కాలానికి 2,226 దరఖాస్తులతో రాష్ట్రంలో 3వ స్థానంలో ఉంది. ఈ దుకాణాలు నష్టంతో పనిచేస్తున్నాయనే వాదనలను నేను అధికారికంగా ఖండించాలనుకుంటున్నాను; అధికారిక రికార్డులు వాటి లాభదాయకతను ధృవీకరిస్తున్నాయి. ఇంకా, మేము ఏపీ ఎక్సైజ్ యాప్ ద్వారా నిఘా పెంచుతున్నాము మరియు ఏఐ-ఇంటిగ్రేటెడ్ సీసీటీవీ వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటు చేస్తున్నాము. ఈ సాంకేతికత నేర కార్యకలాపాలను గుర్తించిన తర్వాత 0 ఎఫ్ఐఆర్లను స్వయంచాలకంగా జారీ చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ ప్రక్రియకు ఆటంకం కలిగించడానికి రాజకీయ నాయకులు లేదా సిండికేట్ల జోక్యాన్ని సహించబోమని దయచేసి సలహా ఇవ్వండి. రాష్ట్ర ప్రభుత్వ పూర్తి సహకారంతో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి ఆటంకం కలిగించే ఏ ప్రయత్నమైనా తీవ్రమైన చర్యలకు దారి తీస్తుంది. అలాంటి ప్రయత్నాలు ఏవైనా ఉంటే వెంటనే మాకు తెలియజేయాలని జాయింట్ కమిషనర్ టి.నాగ లక్ష్మి నోడల్ ఆఫీసర్ అభ్యర్థిస్తున్న అని తెలిపారు.



printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com